ప్రజాశక్తి
శనివారం 6 సెప్టెంబరు 2025
5
శ్రీకాకుళం



వైద్య కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ



శ్రీకాకుళం : ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎస్.అప్పలనాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కమ్యూనిటీ హెచ్‌ఒడిగా పనిచేశారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ జాకబ్, అకడమిక్ ఇన్‌ఛార్జి నాగేంద్రనాయుడు, వైస్ ప్రిన్సిపల్ సునీల్ నాయక్, కళాశాల సూపరింటెండెంట్ హనుమంతు సాయిరాం, ఇతర సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మందకొడిగా ఈ-క్రాప్ నమోదు

- నమోదు చేయాల్సింది 19 లక్షల సర్వే నంబర్లు
- ప్రస్తుతం 79 వేల నంబర్లే నమోదు
- యాప్‌లో నమోదు, సాంకేతిక సమస్యలతో జాప్యం
- ఈనెలాఖరు వరకు గడువు పెంపు

జిల్లాలో ఈ-క్రాప్ నమోదు మందకొడిగా సాగుతోంది. పంటల కొనుగోలు, వరదలు, తుపాన్ల సమయంలో ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాల వర్తింపునకు ఈ-క్రాప్ ముఖ్యమైన ప్రక్రియ. క్షేత్రస్థాయిలో నెలకొన్న రకరకాల కారణాలతో జిల్లాలో ఇది ముందుకు సాగడం లేదు. గతంలో 25 సెంట్లు పైబడి ఉన్న భూమికి మాత్రమే పొలం ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేవారు. ఈసారి ప్రతి సర్వే నంబరుకు 50 మీటర్ల దూరంలో ఉండి నమోదు చేసేలా యాప్ రూపొందించడంతో చాలా సమయం పడుతోంది. దీంతోపాటు క్షేత్రస్థాయి సిబ్బందికి ఇతర సాంకేతిక సమస్యలూ ఎదురవుతున్నాయి. ఆన్‌లైన్‌లో భూ విస్తీర్ణం సరిగా చూపకపోవడం, కొద్దిపాటి భూమి మాత్రమే చూపుతుండడం, కొంతమేర సర్వర్ సమస్యలు వెరసి నమోదు ప్రక్రియ జాప్యం కావడానికి కారణమవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం పంటల బుకింగ్‌కు గడువు తేదీని ప్రభుత్వం ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు గడువు పెంచింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస, బూర్జ



జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిసి 5.91 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. ఇప్పటివరకు 79 వేల ఎకరాలు (14 శాతం) మాత్రమే ఈ-క్రాప్‌లో బుకింగ్ అయ్యాయి. మొత్తం 19 లక్షల ల్యాండ్ పార్సిల్ సర్వే నంబర్లను నమోదు చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 79 వేల సర్వే నంబర్ల నమోదు పూర్తయినట్లు సమాచారం. విలేజ్ అగ్రికల్చర్ అసిసెంట్లు (విఎఎ), విలేజ్ హార్టికల్చర్ అసిసెంట్లు (విహెచ్‌ఎ) తదితర సిబ్బంది పొలం వద్దకు వెళ్లి భూమి సబ్ డివిజన్ సర్వే నంబర్ల ఆధారంగా పంట వివరాలను నమోదు చేస్తున్నారు. రైతుల ఫొటోలనూ అప్‌లోడ్ చేస్తున్నారు. భూమి సర్వే నంబర్లు, పాసు పుస్తకాల ఖాతాల నంబర్లు, ఏ పంట వేశారో నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫార్మాట్‌లో తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాల్సి ఉండడంతో ఎక్కువ సమయం పడుతోంది.

జాప్యానికి ఇవీ కారణాలు

గతంలో 25 సెంట్లు పైబడి ఉన్న భూమికి మాత్రమే పొలం ఫొటోను ఆన్‌లైన్‌లో ఆప్‌లోడ్ చేసేవారు. ఈసారి ప్రతి సర్వే నంబరుకు 50 మీటర్ల దూరంలో ఉండి నమోదు చేస్తేనే యాప్ రిసీవ్ చేసుకుంటోంది. దీనివల్ల ఎక్కువ సమయం పడుతోందని విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు (విఎఎ), విలేజ్ హార్టికల్చరల్ అసిసెంట్లు (విహెచ్‌ఎ) వాపోతున్నారు. రోజుకి 300 ల్యాండ్ పార్సిల్ నంబర్లు వందల సర్వే నంబర్లు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. యాప్‌లో రైతుల వివరాల నమోదుతో పాటు లైవ్‌లో ఫొటోలు తీయాల్సి రావడంతో, సెల్‌ఫోన్ ఛార్జింగ్ సమస్యలూ తలెత్తుతున్నాయి. ఫీల్డ్‌లో పది సర్వే నంబర్లు అంటే గరిష్టంగా 200 ఎల్‌పిఎం నంబర్లు కంటే ఎక్కువ నమోదు చేయడానికి సాధ్యపడడం లేదు. రైతుల భూములకు సంబంధించిన సర్వే నంబర్లు ఆన్‌లైన్‌లో చూపకపోవడంతో, క్షేత్రస్థాయి సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. రైతుకు పలు ప్రాంతాల్లో భూములు ఉండగా, అధిక విస్తీర్ణం ఉన్న భూమి మాత్రమే ఆన్‌లైన్‌లో కనిపిస్తోంది.

పంటల క్రాపింగ్ వేగవంతానికి చర్యలు

పంటల ఈ-క్రాపింగ్‌ను వేగవంతం చేసేలా చర్యలు చేపడుతున్నాం. పంటలు సాగు చేస్తున్న రైతులందరి వివరాలను నమోదు చేస్తాం. క్షేత్రస్థాయిలో కొన్ని సమస్యలు ఉన్నాయి. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించి నమోదు ప్రక్రియ వేగవంతమయ్యేలా చూస్తున్నాం. పంటల నమోదుకు ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు గడువు పెంచింది. రైతులంతా తమ వివరాలను నమోదు చేసుకోవాలి

- త్రినాథస్వామి, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు

పని ఒత్తిడితో సిబ్బంది సతమతం

పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో, సాంకేతిక సమస్యలు కొంతమేర ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అంతా ఒకేసారి ప్రయత్నిస్తుండడంతో సర్వర్ సమస్యలు తలెత్తుతున్నట్లు సిబ్బంది చెప్తున్నారు. పైగా కొన్నిచోట్ల సిగ్నల్స్ లేకపోవడంతో, అప్‌లోడ్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికితోడు వర్షాలు పడుతుండడంతో పనికి ఆటంకం కలుగుతోంది. యూరియా పంపిణీకి సంబంధించిన పనులూ మరోవైపు చేస్తుండడంతో, నమోదు ప్రక్రియ ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. ఈసారి యాప్ కూడా ఇవ్వడం జాప్యానికి మరో కారణంగా ఉంది. మరోవైపు ఈ-క్రాప్ లక్ష్యం చేరుకోలేకపోవడంతో అధికారులు నుంచి వస్తున్న ఒత్తిళ్లతో క్షేత్రస్థాయి సిబ్బంది తీవ్ర పని ఒత్తిడికి లోనవుతున్నారు.

రైతులకు తప్పని అవస్థలు

ఈ-క్రాప్ నమోదు ప్రక్రియలో అటు రైతులకూ ఇబ్బందులు తప్పడం లేదు. భూములను కౌలుకి ఇచ్చి వలస వెళ్లిన వారికి ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో వారు రాకుండానే పంట ఈ-క్రాప్‌లో నమోదయ్యే పరిస్థితి ఉండేది. జియోట్యాగింగ్ పద్ధతిలో వారు తప్పనిసరిగా రావాల్సి వస్తోంది. పంటను ఏదో విధంగా అమ్ముకుందామనుకున్నా ఈ-క్రాప్ చేయించకపోతే ఇన్సూరెన్స్ వచ్చే పరిస్థితి లేకపోవడంతో, కొందరు సొంత గ్రామాలకు వస్తున్నారు. భూమిని కౌలుకి ఇచ్చిన వారు మాత్రం రావడానికి ఇష్టపడడం లేదు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఉపాధ్యాయ వృత్తికి సమాజంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యాన నగరంలోని అంబేద్కర్ కళావేదికలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవ సభను శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే శక్తి గురువులకు మాత్రమే ఉందన్నారు. విద్యతో పాటు విలువలు నేర్పేది, చదవుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచేది గురువులేనన్నారు. మాతృ భాషకు ప్రాధాన్యతనిస్తూ ఇతర భాషలపై విద్యార్థులు పట్టు సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థి కేంద్ర బిందువుగా మెరుగైన విద్యాబోధన లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఉపాధ్యాయులపై అదనపు భారం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ప్రతి పాఠశాలలో విలువలతో కూడిన నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. విద్యారంగ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే డిఎస్‌సి నిర్వహించి 16,347 పోస్టుల నియామక ప్రక్రియ చేపట్టిందని తెలిపారు. ఏటా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

ఇన్‌ఛార్జి జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు, సమగ్ర శిక్ష ఎపిసి ఎస్.శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థి జ్ఞానాన్ని వెలికితీసే వారే ఉపాధ్యాయులన్నారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 60 మందికి శాలువాలు కప్పి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. తొలుత పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ గౌరీశంకర్, సాయిప్రసాద్, బెజ్జిపురం యూత్ క్లబ్ అధ్యక్షులు ప్రసాదరావు, ఉ పాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే శంకర్

పెళ్లయిన నాలుగు నెలలకే...

వరకట్న వేధింపులతో వివాహిత బలవన్మరణం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఎన్నో ఆశలతో అత్తారింట్లోకి అడుగుపెట్టిన 'ఆమె' జీవితం పెళ్లయిన నాలుగు నెలలకే ముగిసిపోయింది. వరకట్న వేధింపులు తాళలేక పట్టణంలోని ఐ.జె నాయుడు కాలనీకి చెందిన నవిరి పూర్ణ (22) బలవన్మరణానికి పాల్పడింది. అదనపు కట్నం తేవాలని భర్త, అత్తామామల నుంచి రోజురోజుకూ పెరుగుతున్న వేధింపులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిట్టివలసకు చెందిన నవిరి సింహాచలం, పద్మ దంపతుల చిన్న కుమార్తె పూర్ణను పట్టణంలోని ఐ.జె నాయుడు కాలనీకి చెందిన సాయిపల్లి మధుసూదనరావుతో ఈ ఏడాది ఏప్రిల్‌లో వివాహం చేశారు. వివాహ సమయంలో మృతురాలి తల్లిదండ్రులు అల్లుడికి రూ.ఐదు లక్షల కట్నం, ఎనిమిది తులాల బంగారం ఇతరత్రా సామగ్రి ఇచ్చారు. పెళ్లయిన కొద్దిరోజులు వారి దాంపత్య జీవితం సాఫీగానే సాగినా, తర్వాత నుంచి అదనపు కట్నం తేవాలని భర్త, అత్తమామల నుంచి వేధింపులు పెరిగాయి. వేధింపులు తట్టుకోలేని పూర్ణ పుట్టింటికి చేరుకుంది. గత నెల 17వ తేదీన ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌లో భర్త, అత్తమామలపై వరకట్న వేధింపులపై ఫిర్యాదు చేసింది. కొద్దిరోజుల తర్వాత గ్రామ పెద్దలు ఇరు కుటుంబాలనూ కూర్చోబెట్టి పూర్ణను తిరిగి అత్తారింటికి పంపించారు. ఇంత జరిగినా వరకట్న వేధింపులు ఆగకపోవడంతో ఆమె తిరిగి కన్నవారింటికి వచ్చేసింది. పెళ్లయినా పుట్టింట్లోనే ఉంటున్నానన్న బాధ, అత్తారింటి వరకట్న వేధింపులతో మనస్తాపానికి గురై ఈనెల రెండో తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు గమనించి శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి సింహాచలం ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద కేసు నమోదు చేయగా, ఆమదాలవలస తహశీల్దార్ రాంబాబు ఆధ్వర్యంలో శవ పంచనామా నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనపల బాలరాజు తెలిపారు.



పూర్ణ (ఫైల్ ఫొటో) పూర్ణ మృతదేహం

అటవీ అధికారుల పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఈనెల ఏడో తేదీన నిర్వహించే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, సహాయక బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షలకు జిల్లాలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 5,186 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని చెప్పారు. ఉదయం పది నుంచి 12.30 గంటల వరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, సహాయక బీట్ ఆఫీసర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విభాగానికి 4,495 మంది అభ్యర్థులు హాజరవుతారని చెప్పారు. మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించే ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పరీక్షకు 691 మంది అభ్యర్థులు పాల్గొంటారని తెలిపారు.

పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎపిపిఎస్‌సి సెక్షన్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ, అభ్యర్థులకు పరీక్షా సమయానికి గంటన్నర ముందు పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందని తెలిపారు. పరీక్షా సమయానికి పావుగంట ముందుగా గేట్లు మూసివేస్తారని చెప్పారు. ఈ పరీక్షలు ఒఎంఆర్ షీట్ల ద్వారా ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారని తెలిపారు. ఒఎంఆర్ షీట్లపై అభ్యర్థి వివరాలు ముందే ముద్రించి ఉంటాయని, వాటిని మార్చేందుకు వీల్లేదన్నారు. ఏవైనా షీట్లు పాడైతే బఫర్ షీట్ల నుంచి అందజేస్తారని తెలిపారు. అభ్యర్థులు నామినల్ రోల్స్‌లో కేవలం ఒక సంతకం మాత్రమే చేయాలని, అందులో ఏ మార్పులు చేయకూడదని స్పష్టం చేశారు. ఫోన్లు, కాలిక్యులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు రూమ్‌లు, హాల్స్ గురించి తెలియజేసేందుకు సహాయకులను అందుబాటులో ఉంచాలని కళాశాల యాజమాన్యాలకు సూచించారు. ప్రతి కేంద్రం వద్ద విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, వైద్య, విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఎపిపిఎస్‌సి సెక్షన్ అధికారులు మల్లికార్జున రెడ్డి, నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు

మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి - ఆమదాలవలస

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రాష్ట్ర పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని యరగాంలో ఉపాధి హామీ నిధులు రూ.92 లక్షలతో నిర్మించిన సిసి రహదారులు, డ్రైన్లను శుక్రవారం ప్రారంభించారు. చినకాగితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మాజీ రాష్ట్రపతి ఎ.పి.జె అబ్దుల్ కలాం విగ్రహాలను ఆవిష్కరించారు. గురుపూజోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించి, ఉపాధ్యాయులను సన్మానించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం శరవేగంగా దూసుకుపోతోందన్నారు. పట్టణాలతో పాటు ప్రధాన రహదారులు, గ్రామీణ రహదారులు, ఇతర మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎల్.మధుసూదన్, ఎంపిడిఒ ఎం.పావని, డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, టిడిపి నాయకులు జి.తిరుమలరావు, కిల్లి సిద్ధార్థ, పల్లి సురేష్, నూక కోటేశ్వరరావు, అంబల్ల రాంబాబు మండల తెలుగు యువత అధ్యక్షులు ధవళ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం : మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

అంగన్వాడీల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - బూర్జ, రణస్థలం, పలాస

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, ఎన్.గణపతి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బూర్జ, రణస్థలం, పలాసలో యూనియన్ ప్రాజెక్టు మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబరు 14న పాతపట్నంలో నిర్వహించే అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 2023 డిసెంబర్ 2024 జనవరిలో చేసిన 42 రోజులు సమ్మె పోరాటం చారిత్రాత్మకమైందన్నారు. ఆ సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని నేటికీ కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. అంగన్వాడీలకు వేతనాలు కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి పెంచలేదని, మన రాష్ట్రంలో 2019 నుంచి పెంచలేదన్నారు. అంగన్వాడీలకు డిఎ, పిఆర్‌సి అమలు చేయడం లేదని చెప్పారు. సంక్షేమ పథకాలు కూడా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని కోరారు. గ్రాట్యుటీ జిఒలో మార్పులు చేయాలని, హెల్పర్లు ఉద్యోగోన్నతులకు విధి విధానాలు రూపొందించాలని కోరారు.

అనంతరం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. బూర్జ ప్రాజెక్టు కమిటీ గౌరవాధ్యక్షులుగా సిహెచ్.అన్నపూర్ణ, అధ్యక్షులుగా కె.రాధిక, ప్రధాన కార్యదర్శిగా కె.జ్యోతి, ఉపాధ్యక్షులుగా ఇ.కళావతి, కె.విజయలక్ష్మి, బి.సరస్వతి వై.విజయనిర్మల, సహాయ కార్యదర్శులుగా ఎస్.నారాయణమ్మ, జి.కష్ణవేణి, వి.గున్నమ్మ, జి.రమణమ్మలతో 16 మందిని ఎన్నుకున్నారు. రణస్థలం ప్రాజెక్టు కమిటీ గౌరవాధ్యక్షులుగా కె సుజాత, అధ్యక్షులుగా ఎన్.వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బి.అప్పమ్మ, ఉపాధ్యక్షులుగా కె.అసిరితల్లి, జి.ధనలక్ష్మి, బి.రేవతి, జి.లక్ష్మి, సహాయ కార్యదర్శులుగా బి.స్వాతి, టి.సుజాత, పి.నాగమణి, డి.సుజాత, వి.నాగమణి, కోశాధికారి బి.లక్ష్మితో పాటు 25 మందిని ఎన్నుకున్నారు. పలాస ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు బి.సునీత, కార్యదర్శిగా ఎం.మంజులా కుమారి, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నిర్వాసితుల ప్లాట్ల కేటాయింపు నేటికి వాయిదా

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

మండలంలోని మూలపేట పోర్టు నిర్వాసితులకు నౌపడలోని పునరావాస కాలనీలో శుక్రవారం నిర్వహించాల్సిన లాటరీ ద్వారా ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ శనివారానికి వాయిదా పడింది. టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి, తహశీల్దార్ హేమసుందర్ ఆధ్వర్యాన మూలపేటకు చెందిన నిర్వాసితులకు ప్లాట్లు కేటాయించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. పునరావాస కాలనీలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల్లేవని, మూలపేట గ్రామంలోని ఆలయాల నిర్మాణంపై స్పష్టత ఇవ్వకపోవడంపై పలువురు నిర్వాసితులు, నాయకులు సమావేశానికి గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ కృష్ణమూర్తి మాట్లాడుతూ అన్ని మౌలిక సదుపాయాల పనులు జరుగుతున్నాయని, పూర్తిస్థాయిలో అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. గ్రామస్తులు అందరూ చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించి శనివారం వాయిదా వేశారు. గతంలో విష్ణుచక్రం గ్రామానికి చెందిన సుమారు 60 ఇళ్లకు లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించారు. ఈ గ్రామాన్ని పూర్తిగా తొలగించి పునరావాస కాలనీకి తరలించారు. ప్రస్తుతం పునరావాస కాలనీలో విష్ణుచక్రం గ్రామస్తులు ఇళ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది.



నిర్వాసితులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

సేంద్రీయ ఉత్పత్తులతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రకతి సిద్ధమైన పద్ధతుల్లో సాగు చేసిన సేంద్రీయ ఉత్పత్తులే సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తాయని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని రైతుబజారు వద్ద డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటైన మూడు సేంద్రీయ ఉత్పత్తుల మొబైల్ వాహనాలను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా, కంపోస్టు, పచ్చిరొట్ట వంటి జీవ ఆధారిత ఎరువులతో పండించే పంటలతో వచ్చే ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని వివరించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ టి.వి ఫణిపేర్రాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ టి.వి ఫణిపేర్రాజు డిమాండ్ చేశారు. ఎపి జెఎసి అమరావతి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నగరంలోని రెవెన్యూ అతిథిగృహంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన బకాయిల వివరాలు వెంటనే పే స్లిప్పులు, సిఎఫ్‌ఎంఎస్‌లో చూపించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం ఐఆర్ ప్రకటించాలని, 12వ పిఆర్‌సి కమిషన్ నియమించాలని కోరారు. పెండింగ్ డిఎలు, 11వ పిఆర్‌సి బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్ అయిన ఉద్యోగుల బకాయిల చెల్లింపులో జాప్యం వల్ల ఉద్యోగులు, పెన్షనర్లలో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. బకాయిలు అందుకోకుండానే కొంతమంది చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సీనియార్టీ ప్రకారం ఉద్యోగోన్నతులు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మేనిఫెస్టోలో ఇచ్చినట్లుగా సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులకు సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.అర్లయ్య మాట్లాడూతూ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్ కార్యాచరణ ప్రకటించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎపి జెఎసి అమరావతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీరాములు, సీపాన వెంకటరమణ మాట్లాడుతూ నెలకి రూ.పది వేల లోపు పెన్షన్ పొందుతున్న రిటైర్డు ఆర్‌టిసి, రెవెన్యూ ఉద్యోగులకు రేషన్ కార్డులు మంజూరు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళా ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ఇచ్చిన విధంగా రెండేళ్ల చైల్డ్ కేర్ లీవ్ కల్పించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఫణిపేర్రాజు

డివిజన్ల కమిటీల ఎన్నిక

అనంతరం శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజన్ల కమిటీలను ఎన్నుకున్నారు. శ్రీకాకుళం డివిజన్ అధ్యక్షులుగా ఎస్.గణపతిరావు, ప్రధాన కార్యదర్శిగా పి.రాజశేఖర్, శ్రీకాకుళం డివిజన్ మహిళా విభాగ అధ్యక్ష, కార్యదర్శులుగా డి.వనజాక్షి, పి.రాజేశ్వరి, శ్రీకాకుళం సిటీ మహిళా విభాగ అధ్యక్ష, కార్యదర్శులుగా డి.అనురాధ, డి.సుభద్ర, టెక్కలి డివిజన్ అధ్యక్షులుగా బి.హేమసుందర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎం రావు, మహిళా విభాగ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.పవిత్ర, ఎన్.అనూష, పలాస డివిజన్ అధ్యక్షులు పి.రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.వి కుమార్, మహిళా విభాగ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.కరుణమ్మ, పి.ఎస్ రాణిని ఎన్నుకున్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఎస్.మల్లేశ్వరరావు, కె.ప్రవల్లిక ప్రియ, పి.శ్రీను, జల్లేపల్లి రామారావు, కాశీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురువే మార్గదర్శి


నరసన్నపేట : ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- కవిటి

సమస్త ప్రపంచానికి గురువే మార్గదర్శిని, గురువుని మించిన నిఘంటువు మరొకటి లేదని ఎమ్మెల్యే బెందాలం అశోక్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు కవిటి లోల్ల నారాయణమూర్తి కళ్యాణ మండపంలో నిర్వహించారు. పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్, ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ సమాజానికి నిజమైన మార్గదర్శి గురువని, గురువు లేని విద్య రాణించదని అన్నారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బహుమతులు అందించి, మండల ఉత్తమ ఉపాధ్యాయుడు శమల్ల రాజబాబు, మండల విద్యాశాఖ అధికారులు ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ, పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అదే విధంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించి ఉపాధ్యాయ దినోత్సవ విశిష్టత, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చరిత్రను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి కడియాల పద్మ, మండల విద్యాశాఖ అధికారులు ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: జ్ఞానమనే వెలుగును ఇచ్చే అత్యున్నత స్థానం గురువులకు దక్కుతుందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు అన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్‌వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం పురస్కరించుకొని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఉన్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో శాసపు జోగినాయుడు, గుడ్ల సత్యనారాయణ, బి.వి రవిశంకర్, గేదెల లక్ష్మీ, సుగంధం సంజీవరావు, వావిలపల్లి జగన్నాథ నాయుడు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి ఐతమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఆర్‌ఎన్‌డి విభాగం డీన్ డాక్టర్ డి.శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, డీన్లు డాక్టర్ డి.విజయ్‌కుమార్, డాక్టర్ బి.వి.రమణ, డాక్టర్ ఎం.జయ మన్మథరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నరసన్నపేట: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు రోణంకి కృష్ణన్నాయుడు, దామోదర నరసింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ పాగోటి ఉమామహేశ్వరి, శిమ్మ చంద్రశేఖర్, జామి వెంకటరావు, చిట్టిబాబు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: స్థానిక ఎంఆర్‌సి భవనం వద్ద ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఎంఇఒలు శ్రీరాములు, మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: యామలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మీసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆది కేశవరెడ్డి, విశ్వేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే కొల్లిపాడు జెడ్‌పి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం మెట్ట రామారావు సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఇచ్ఛాపురం: సమాజంలో ఉపాధ్యాయ పాత్ర ప్రశంసనీయమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ కమ్యూనిటీ భవనంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంఇఒలు అప్పారావు, విశ్వనాధ్, ఎంపిపి బోర పుష్ప, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మోహన్ వెంకటేష్, కాదా రామకోటి, దినేష్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మున్సిపాలిటీలోని 21వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి కాళ్ల జయదేవ్ అంగన్వాడీ కార్యకర్తలను సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు హైమవతి, కల్జేపల్లి ఉమా, కాళ్ల జయ తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాకర్ల శ్రీనివాసరావు, సామ సంజీవరావు, రొక్కం నీలకంఠేశ్వర రావు, కొత్తపల్లి సోమశేఖర్, పాతిరి మాధవరావు, కరుకోల నీలాచలం నాయుడు, గేదెల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.సిహెచ్.మధుసూధనరావు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక మండల రిసోర్స్ కార్యాలయం వద్ద నున్న సర్వేపల్లి విగ్రహానికి ఎంఇఒ, ఉపవిద్యాశాఖాధికారి పి.విలియమ్స్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, రిసోర్స్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్వేపల్లి విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ నివాళ్లర్పించారు. గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.రూపావతి సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, అధ్యాపకులు వి.లూక్‌పాల్, కోటేశ్వరరావు, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు. ఆల్వాజెన్ పాఠశాల్లో కరస్పాండెంట్ కోత మురళీధర్, బిఎస్‌జెఆర్ డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపాల్ కోత శ్రీనివాసరావు, పేడాడ విద్యాసంస్థల్లో చైర్మన్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, కరస్పాండెంట్ పేడాడ చంద్రశేఖర్ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు. టెక్కలి ఐసిడిఎస్ కార్యాలయం పరిధిలో టెక్కలి, నందిగాం మండలాలకు చెందిన సుమారు 9 మంది అంగన్వాడీలను ఉత్తమ అంగన్వాడీలుగా ఎంపిక చేసి పిఒ విద్య చేతులమీదుగా సత్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీలు బి.నీరజ, రాజేశ్వరి, మణెమ్మ, కృష్ణవేణి, ఇందిరా, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : సమాజాభివృద్ధిలో గురువుదే అగ్రస్థానమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని దూసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు టిడిపి నాయకులు నూకరాజు, తమ్మినేని అప్పలనాయుడు, దుప్పల గణపతి, తమ్మినేని చంటి, శ్రీనివాసరావు, సీతారాం పాల్గొన్నారు.


ఆమదాలవలస : సరస్వతిదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పలాస: స్థానిక మదర్ థెరీస్సా పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్, పాఠశాల చైర్మన్ వజ్జ బాబూరావు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం విశ్రాంత ప్రిన్సిపాల్ మజ్జి పున్నయ్య, విశ్రాంత ఎంఇఒ పైల కృష్ణప్రసాద్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని, ఇన్‌ఛార్జి ఆర్.ప్రసాదరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఎంఆర్‌సి కేంద్రం వద్ద ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎంఇఒ సిహెచ్ శ్రీనివాసరావు సర్వేపల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంఐసి కోఆర్డినేటర్ పోతనపల్లి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: జిల్లా విద్యా శిక్షణ సంస్థ వమరవల్లి ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ ప్రధాన ఆచార్యులు ఎ.గౌరీ శంకరరావు అధ్యక్షత వహించి ఉపాధ్యాయుల ప్రాధాన్యత వివరించారు.

హర్షవల్లి లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో

కాంతిని మానవాళికి అందించే మహనీయుడు ఉపాధ్యాయుడని హర్షవల్లి లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు హారికా ప్రసాద్ అన్నారు. స్థానిక రైతు బజార్ కూడలిలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు.

అలాగే శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు విశాఖపట్నం చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఇల్లీసుపురంలోని బ్రహ్మకుమారి కార్యాలయంలో నిర్వహించారు. ట్రస్ట్ చైర్‌పర్సన్ కుప్పిలి కీర్తి పట్నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు జిల్లాకు చెందిన 30 మంది ఉపాధ్యాయులను స్వత్కరించారు.


మజ్జిలిపేటలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ

ప్రజాశక్తి- పొందూరు

ఎటువంటి రాజకీయ ప్రమేయం లేకుండా, వివాదాలు తలెత్తకుండా ఉండేలా శుక్రవారం పోలీసుల సమక్షంలో రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని మజ్జిలిపేట, తాడివలస గ్రామాల్లో ఎఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేపట్టారు. ఒక్కో రైతుకు ఒక్క యూరియా బస్తాను మాత్రమే అందజేశారు. యూరియా పంపిణీలో తోపులాటలు, ఘర్షణలు లేకుండా ముందుస్తుగా పోలీసుల రక్షణను ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల రైతులు యూరియా కోసం వచ్చినప్పటికీ వారికి ఇవ్వకుండా స్థానిక రైతులకే అందజేశారు. దీంతో యూరియా కోసం రైతులు పెద్దఎత్తున బారులు తీరారు. మజ్జిలిపేటలో 158 బస్తాలు, తాడివలసలో 176 బస్తాల యూరియాను రైతులకు పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

తక్షణమే అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - టెక్కలి

వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం పిహెచ్‌సి వైద్యులు కందుకూరి వాహిణి ప్రియాంకపై దాడి ఘటన బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కులనిర్మూలనా పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం టెక్కలి డిఎస్‌పిని కలిసి వినతిపత్రం ఆందించారు. దళిత మహిళా వైద్యురాలిపై జరిగిన దాడిలో తాత్సారం చేయడం తగదన్నారు. డిఎస్‌పిని కలిసి వినతిపత్రం అందించిన వారిలో కుల నిర్మూలనా పోరాటసమితి రాష్ట్ర నాయకులు మిస్కా కృష్ణయ్య, బెలమర ప్రభాకర్‌తో పాటు మాలమహానాడు జిల్లా నాయకులు రాకోటి రాంబాబు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు ఉర్జాన అప్పలరాజు, కొత్తపల్లి హిమారావు పాల్గొన్నారు.


ఘనంగా దసరా శుభరాట

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామదేవత శ్రీ స్వేచ్ఛవతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఘనంగా దసరా నవరాత్రి ఉత్సవాలకు శుభ రాట వేశారు. ఆలయంలో ఈ నెల 22 నుంచి నిర్వహించనున్న దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుభ రాట వేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీసభ్యులు పాల్గొన్నారు.

యోగాసనాల్లో శ్రీకాంత్ ప్రతిభ

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన యోగా క్రీడాకారుడు శ్రీకాంత్ మహంతి మహారాష్ట్ర నాగపూర్‌లో జరిగిన 37వ జాతీయ స్థాయి యోగా ఛాంపియన్ షిప్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానం సాధించాడు. నాగపూర్‌లో మూడురోజుల పాటు 14 రాష్ట్రాలు వివిధ విభాగాల్లో పోటీ పడ్డారని శ్రీకాంత్ మహంతి తెలిపారు. 23 నుంచి 30 ఏజ్ గ్రూప్‌లో ద్వితీయ స్థానం సాధించినట్టు తెలిపారు. ఇప్పటికే అనేక పతకాలు సాధించిన శ్రీకాంత్ ద్వితీయ స్థానం సాధించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోతకు గురైన శివసాగర్ బీచ్


కోతకు గురైన తీరం

వజ్రపుకొత్తూరు: ఇటీవల బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన సముద్ర అలల తాకిడికి శివసాగర్ బీచ్ కోతకు గురైనట్లు మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. సముద్ర తీరం సుమారు 50 అడుగులు ముందుకొచ్చిందని మత్స్యకారులు తెలిపారు. అలాగే చేపల వేటకు వెళ్లినప్పుడు తెప్పలు సముద్రంలోకి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వర్షాలు వలన కాలువలు, నదులు ద్వారా కొట్టుకొచ్చిన చెత్త సముద్రంలో కలవడం వలన బీచ్ మొత్తం చెత్త, చెట్లు, కొమ్మలతో నిండి ఉండడం వలన పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ధనుంజయ, పాపారావు తెలిపారు.

ప్రజలే ప్రచారకర్తలుగా మారాలి

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

ప్రజాశక్తి- సోంపేట


మాట్లాడుతున్న విప్ అశోక్

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందుతూ, అభివృద్ధిని సాధిస్తున్న ప్రజలే కూటమి ప్రభుత్వానికి ప్రచారకర్తలుగా మారాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపం వద్ద శుక్రవారం నిర్వహించిన పార్టీ అనుబంధ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, మండల పార్టీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర విభజన తరువాత రాజధాని లేకుండా అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని బాగు చేసేందుకు ప్రజలంతా చంద్రబాబు నాయుడు సమర్థుడని భావించి, ఆయనకు పట్టం కట్టారన్నారు. అందుకు తగ్గట్టుగానే చంద్రబాబు ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి బయటపడేసి, అభివృద్ధి వైపు పరుగులు తీయించారన్నారు. అదే సమయంలో సంక్షేమ పథకాలను అందించడం జరిగిందన్నారు. తర్వాత ఎన్నికల్లో ప్రజలు ఒక్క అవకాశం అంటూ వచ్చిన జగన్మోహన్ రెడ్డికి ఓట్లు వేయడంతో ఐదేళ్ల కాలంలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా టిడిపి నాయకులు, కార్యకర్తలు బయట తిరగలేని పరిస్థితిని కల్పించారన్నారు. రానున్న రోజుల్లో సంక్షేమ పథకాలు పొందిన ప్రజలే ప్రచారకర్తలుగా మారి కూటమి ప్రభుత్వానికి సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గౌతు శివాజీ మాట్లాడుతూ మొదటి నుంచి ఇచ్ఛాపురం నియోజకవర్గం టిడిపికి కంచుకోట అన్నారు. పార్టీలో కష్టపడిన వారందరికీ తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు కలమటి వెంకట రమణ, సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాలకు చెందిన పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉద్దానం' జిల్లా ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లు

ప్రజాశక్తి- కవిటి

కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా పలాస కేంద్రంగా ఏర్పడనున్న కొత్త జిల్లాకు 'ఉద్దానం' పేరు పెట్టాలని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లు కోరారు. ఈ మేరకు కళింగ కార్పొరేషన్ అధ్యక్షుడు, బిసి శాఖ జాయింట్ మేనేజర్ ఉమాదేవికి వినతిపత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్ కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు అధ్యక్షతన, బిసి శాఖ అధికారులు, జాయింట్ మేనేజర్ ఉమాదేవి ఆధ్వర్యంలో విజయవాడలో కార్పొరేషన్ డైరెక్టర్లతో కలిసి బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 12 ప్రధాన అంశాలతో కూడిన అజెండాను ప్రభుత్వం దృష్టిలో పెట్టారు. వాటిలో ముఖ్యంగా పలాస కేంద్రంగా ఏర్పడనున్న కొత్త జిల్లాకు 'ఉద్దానం' పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బార్ల చిన్నబాబు, అట్టాడ రవి బాబ్జి, దుర్యోదన, సనపల వరప్రసాదరావు, మామిడి దుర్గారావు, మొజ్జాడ నాగరాజు, నాంబాడి సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు

ప్రజాశక్తి- కవిటి

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలం నుంచి ఎంపికైన పిరియా వేణుగోపాల్, ఎం.మురళీ ప్రకాష్, ఎం.తోటారావు, బి.దేవదాస్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లు లోళ్ల రాజేష్, బార్ల చినబాబు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, మండల విద్యాశాఖ అధికారులు ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ, కో-ఆప్షన్ మెంబర్ పాండవ చంద్రశేఖర్, మాజీ జెడ్‌పిటిసి బెందాళం రమేష్, ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు ఆరింగి కృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.



పిరియా వేణు గోపాల్ మురళీకృష్ణ


కోటబొమ్మాళి : అవార్డు అందుకున్న నారాయణరావు

ఉత్తమ ఉపాధ్యాయునిగా నారాయణరావు

కోటబొమ్మాళి: 2025 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు, మండలం సింహాద్రిపురం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గొండు నారాయణరావు ఎంపికయ్యారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఆయినను అంబేద్కర్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా విద్యాశాఖాధికారి రవిబాబు, శశిభూషనరావు సన్మానించారు. ఈయన ఎంపికపై మండల విద్యాశాఖాధి కారులు, ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశారు.

నాయకులను కలిసిన ఎఎంసి చైర్మన్

ప్రజాశక్తి- లావేరు


ఎఎంసి చైర్మన్ దంపతులను సత్కరిస్తున్న నాయకులు

మండల కేంద్రం లావేరుకు చెందిన నిడిగంట్ల పద్మను ఎచ్చెర్ల ఎఎంసి చైర్మన్‌గా ప్రభుత్వం గురువారం నియమించడంతో శుక్రవారం ఎచ్చెర్ల నియోజకవర్గంలో పలువురు నాయకులను చైర్మన్ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, టిడిపి మాజీ జిల్లా అధ్యక్షుడు చౌదరి బాబ్జి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, డిసిఎంఎస్ చైర్మన్ అవినాష్, ఎచ్చెర్ల జనసేన ఇన్‌ఛార్జి విశ్వక్సేన్, ఎచ్చెర్ల టిడిపి మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, మాజీ జెడ్‌పిటిసి పిన్నింటి శ్రీదేవి, టిడిపి ప్రధాన కార్యదర్శి పి.మధుబాబు, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, కోష్ట మాజీ సర్పంచ్ పిషిణి జగన్నాధంనాయుడు తదితరులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చైర్మన్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మాకన శంకరరావు, లంకలపల్లి శ్రీనువాసరావు, కోరాడ వెంకటరమణ, సంపతిరావు నాగేశ్వరరావు, బెండు మల్లేశ్వరరావు, కాకర్ల బావాజీ, జి.సిగడాం, రణస్థలం టిడిపి మండల అధ్యక్షులు కొమరాపు రవి, లంక శ్యామ్ తదితరులున్నారు.


అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అంబులెన్స్‌లను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

అంబులెన్స్‌లను సక్రమంగా వినియోగించుకోవాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 108 అంబులెన్స్‌లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎచ్చెర్ల నియోజకవర్గానికి రెండు 108 అంబులెన్స్‌లను మంజూరు చేసిందన్నారు. కూటమి నాయకులు లంక శ్యాం, డిజిఎం ఆనందరావు, పిషిని జగన్నాథం నాయుడు, పిన్నింటి భానోజీ నాయుడు, రౌతు శ్రీను, వడ్డాది శ్రీను, ఎం.కనకారావు, లంక ప్రభ, జీరు గురునాయుడు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

స్థానిక మేజర్ పంచాయతీలో పారిశుధ్య పనులు ముమ్మరంగా ఇఒ ఎవి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టారు. శుక్రవారం భైరవేది, రామదాసు పేట, భవాని నగర్‌లో ఎప్పటినుంచో కాలువలు కూడుకుపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి ప్రవేశించడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పంచాయతీ పాలకవర్గం సభ్యులు రూ.15 లక్షలతో ప్రత్యేక పారిశుధ్య పనుల కోసం కేటాయించారు. ఆ నిధులతో పనులు చేపట్టారు.

ఆర్థికసాయం అందజేత

పలాస: స్థానిక సీతారామ నగర్‌లో నివాసం ఉంటున్న తెలకల కామేష్. వృత్తి రీత్యా జీడిపిక్కల కళాసీగా జీవనం సాగిస్తున్నారు. ఇటీవల జరిగిన ఓ ప్రమాదంలో కాలు విరిగిపోయి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. మందుల ఖర్చుల నిమిత్తం కాష్యూలేబర్, రైస్ మిల్లర్స్ లేబర్ యూనియన్ సహకారం, ఆ నలుగురు ట్రస్ట్ సహాయంతో రూ. 20, 500 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పలాస జీడి కార్మికుల సంఘం అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, ఆ నలుగురు ట్రస్ట్ సభ్యులు, జీడి కార్మికుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాక కూడలిలో గల ఎరువులు, పురుగుల మందు దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రాపాక కూడలిలో గల చిన్న ఎంటర్ ప్రైజెస్, అంజన సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో విజిలెన్స్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ సిహెచ్.వి.ఎస్.ఎస్.ఎర్రన్నాయుడు, ఎస్ఐ బి.రామారావు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో, రికార్డుల్లో ఉన్న స్టాక్ వివరాలను, తేడాలను పరిశీలించారు. అధిక ధరలకు ఎరువులను, పురుగు మందులను విక్రయించినా, సరుకులను నిల్వ ఉంచినా లైసెన్స్ రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గర్భిణి ప్రసవం

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వే స్టేషన్‌లో శుక్రవారం రాత్రి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గర్భిణిణీ ప్రసవం అయ్యింది. ఆర్‌పిఎఫ్ ఎస్ఐ అరుణ, రైల్వే డాక్టర్ వల్ల కీర్తి తెలిపిన వివరాల మేరకు 11020 నెంబరు గల కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఇచ్ఛాపురానికి చెందిన జి.భూలక్ష్మి తన భర్త జానకిరామ్‌తో కలిసి విశాఖపట్నం వెళ్లేందుకు రైలు ఎక్కారు. మార్గమధ్యలో ఆమెకు నొప్పులు రావడంతో ఆమదాలవలస రైల్వే స్టేషన్‌కు రైలు చేరుకోగానే ఆమె భర్త జానకిరామ్ ఆర్‌పిఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. రైలును స్టేషన్‌లో నిలుపుదల చేసి రైల్వే డాక్టర్ కీర్తి అక్కడకు చేరుకొని గర్భిణీని పరీక్షించి కడుపులో ఇద్దరు బిడ్డలు ఉన్నట్లు నిర్ధారించి ప్రసవం చేశారు. మొదట ఆడబిడ్డ జన్మించగా మరో శిశువు ప్రసవం కష్టతరంగా మారడంతో సమస్యను గుర్తించిన డాక్టర్ ఆర్‌పిఎఫ్ సిబ్బందితో కలిసి అంబులెన్స్‌లో గర్భిణీని ప్రసవించిన బిడ్డను ఎక్కించి రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. గర్భిణీ కడుపులో ఉన్న మరో బిడ్డను సర్జరీ ద్వారా ప్రసవం చేయాలని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఎటువంటి సమస్య ఎదురు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

క్రైమ్ కార్నర్

యువకుడు బలవన్మరణం

కొత్తూరు: మండలంలోని వసప గ్రామానికి చెందిన కలగాటి రవి (40) శ్రీకాకుళం సర్వజనాస్పత్రిలో శుక్రవారం వైద్యం పొందుతూ మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే గురువారం తండ్రి కాకయ్య కుమారుడు నిత్యం మందు తాగి డబ్బు ఖర్చు పెడుతున్నావని మందలించడంతో తండ్రిని భయపెట్టేందుకు పొలానికి వేసే గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా వెంటనే స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిఫర్ చేశారు. అక్కడ వైద్యం పొందుతూ మృతి చెందాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ రాజేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస, వజ్రపుకొత్తూరు


వెంకటరమణ (ఫైల్)

మండలం సరియా పల్లి పాత జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వజ్రపుకొత్తూరు మండలం కొమరల్తాడకు చెందిన కె.వెంకటరమణ (35) అనే వ్యక్తి మృతి చెందినట్టు కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వెంకటరమణ గల్ఫ్‌లో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. తన భార్య నోములు తన కన్నవారి గ్రామంలో ఉంటూ కుమార్తె, కుమారుడును చదివించుకుంటుంది. ఆరు నెలల క్రితం వెంకట రమణ ఇక్కడకు వచ్చాడు. గురువారం రాత్రి వెంకట రమణ తన భార్య కన్నవారి గ్రామం మాకన్నపల్లి వెళ్లి భార్య పిల్లలతో రోజంతా గడిపారు. శుక్రవారం ఉదయం తన గ్రామానికి ద్విచక్ర వాహనంతో బెండిగేటు వైపు వేగంగా వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లగేజీ వ్యాన్ ఢీ కొనడంతో వెంకటరమణ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108 వాహనానికి నమాచారం ఇవ్వడంతో 108 సిబ్బంది నారాయణ, సురేష్‌లు పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో వెంకటరమణను చికిత్స నిమిత్తం చేర్పించారు. వెంకటరమణ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకటరమణ మృతితో కొమరల్తాడ, మాకన్నపల్లి గ్రామాల్లో కుటుంబీకులు, బంధువులు పలాస ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరుగా విలపించారు. దీనిపై కాశీబుగ్గ పోలీసులు కేసుననమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస


తాతయ్య (ఫైల్)

పుర పాలక సంఘం లోని 9వ వార్డు మెట్టక్కివలసకు చెందిన బరాటం తాతయ్య (51) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రెండు రోజుల క్రితం తాతయ్య కనిపించడం లేదని ఎవరికైనా తెలిస్తే సమాచారాన్ని ఫోన్ నెంబర్‌కు తెలియజేయాలని ఒక వీడియో సామాజిక మాద్యమంలో హల్చల్ చేసింది. శుక్రవారం పట్టణంలోని 12వ వార్డు పరిధిలోని శ్రీదేవి థియేటర్ సమీపంలోని లక్ష్మీనగర్ స్మశాన వాటిక విశ్రాంతి భవనంలో ఆయన మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, ఎస్ఐ బాలరాజు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి ఎస్ఐ బాలరాజు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో హెచ్‌సి మృతి

పొందూరు: మండలం కనిమెట్టకు చెందిన మహిళ హెడ్‌కానిస్టేబుల్ బగాది రాములమ్మ (36) అనారోగ్యంతో మృతి చెందారు. ఈమె కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యసేవలు పొందుతుంది. మెరుగైన వైద్యం కోసం ఇటీవల చెన్నై ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈమె ఇటీవల హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నత పొంది శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈమె భర్త అప్పలస్వామి ఎస్‌పిఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలున్నారు. జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీస్ శాఖ తరపున మట్టి ఖర్చుల నిమిత్తం రూ.లక్ష చెక్కును డిసిఆర్‌బి సిఐ జి.శ్రీనివాసరావు ద్వారా రాములమ్మ కుటుంబ సభ్యులకు అందించారు. మృతదేహం వద్ద కుమార్తెలు, కుటుంబ సభ్యులు, తల్లిదండ్రుల రోధన చూపరులకు కంటతడి పెట్టించింది.


వాగులోకి దూసుకువెళ్లిన కారు

అదుపు తప్పి వాగులోకి

నందిగాం: జాతీయ రహదారిపై సుభద్రాపురం, పెద్ద లవిసిపల్లి మధ్యలో జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం కారు అదుపుతప్పి వాగులోకి దూసుకెళ్లింది. అయితే ఆ వాగులో నీరు తక్కువగా ఉండటంతో పెనుప్రమాదం తప్పింది. ఈ కారు ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం వెళ్తుంది. కారులో ప్రయాణిస్తున్న వారంతా క్షేమంగా బయటకు రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కారులో నలుగురు ప్రయాణిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత కారులో ఉన్న వారంతా వేరే వాహనంలో వారి స్వగ్రామాలకు చేరుకున్నారు.

బియ్యం పట్టివేత

కొత్తూరు: పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం నుంచి గురువారం రాత్రి నివగాంలోని ఇప్పిలి గోవిందరావుకు చెందిన సత్యనారాయణ మోడరన్ రైస్‌మిల్లుకు అక్రమంగా రెండు వ్యాన్‌లతో 21 క్వింటాల రేషన్ బియ్యం తరలిస్తుండగా సమాచారం తెలుసుకున్న జిల్లా స్పెషల్ అధికారి జి.సూర్య ప్రకాష్, డిటి సిహెచ్ భీమారావులు దాడిచేసి పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రేషన్ బియ్యాన్ని స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించారు.

యూరియా... నానో యూరియా

- ఈ రెండింటి మధ్య తేడా ఏంటి?
- నానోను ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?

ప్రజాశక్తి- రణస్థలం

తెలుగు రాష్ట్రాలు సహా దేశంలో యూరియా కొరత నెలకొన్న విషయం తెలిసిందే. యూరియా బస్తాల కోసం రైతులు వేకువజాము నుంచే అమ్మకం కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారు. ఆయినా సరే.. పంటకు కావలసిన యూరియా బస్తా దొరకడం లేదు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాల వద్ద యూరియా కావలసినంత ఉందని, కావాలనే గోదాముల్లో దాచి బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతూ.. రైతుల జేబులకు చిల్లు పెడుతున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలో రైతులకు నానో యూరియాను పంపిణీ చేసేందుకు ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయి. కానీ.. అది తమకు వద్దంటున్నారు రైతులు. నానో యూరియా వల్ల పంటకు హాని జరుగుతుందా? రైతులు ఎందుకు నానో యూరియా వద్దంటున్నారు ? యూరియా కొరత ఉన్నప్పుడు నానో యూరియా వాడాల్సిందేనని ప్రభుత్వం ఎందుకంత గట్టిగా చెప్తోంది? తెలుసుకుందాం.

మనదేశంలో నానో యూరియా భారతీయ రైతుల ఎరువుల సహకార సంస్థ లిమిటెడ్ 2021లో ప్రవేశపెట్టింది. ప్రభుత్వం దీనిని పర్యావరణ హితమైనదిగా, పంట దిగుబడిని పెంచేదిగా చెప్తోంది. అయితే రైతులు, శాస్త్రవేత్తలు మాత్రం దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తాజా అధ్యయనాలు, రైతుల అనుభవాల ప్రకారం.. నానో యూరియా .. యూరియాకు పూర్తిగా రీప్లేస్ మెంట్ కాదు. అలాగే పంట దిగుబడి కూడా తగ్గుతుంది. పంజాబ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ 2024లో చేసిన అధ్యయనం ప్రకారం.. నానో యూరియా పిచికారి చేయడం వల్ల వరి దిగుబడి 12 శాతం, గోధుమ దిగుబడి 21.6 శాతం తగ్గినట్లు తెలిసింది. దీంతో పాటు ఇది లిక్విడ్ కావడంతో.. ఎక్కువ పొలం ఉన్నవారికి మందును పిచికారి చేసేందుకు కూలీలు ఎక్కువగా కావాల్సి ఉంటుంది. పైగా ఒక పంట కాలంలో నానో యూరియాను 2, 3 సార్లు స్ప్రే చేయాల్సి ఉంటుంది. ఫలితంగా పెట్టుబడి ఖర్చు పెరుగుతుంది. యూరియా ద్వారా పంట దిగుబడి పెరిగితే నానో యూరియా వాడటం వల్ల దిగుబడి తగ్గుతుందని రైతులు విశ్వసిస్తున్నారు. పైగా పండించే పంటలో ప్రొటీన్ కూడా తగ్గుతుందని చెప్తున్నారు.

నానో యూరియా - యూరియా మధ్య తేడా ఏంటి ?

రైతులు వ్యతిరేకిస్తున్న నానో యూరియాకు - యూరియాకు మధ్య కొన్ని తేడాలున్నాయి. 500 ఎంఎల్ నానో యూరియా బాటిల్ 50 కేజీల యూరియా బ్యాగ్‌కు సమానంగా ఉన్నా.. కొన్ని ప్లస్, మైనస్ పాయింట్స్ కూడా ఉన్నాయి. యూరియాకు నానో యూరియాను పూర్తి రీప్లేస్మెంట్‌గా వాడితే పంట దిగుబడి దారుణంగా పడిపోయే ప్రమాదం ఉంది. నానో యూరియాను డైరెక్ట్‌గా మొక్కలపై స్ప్రే చేస్తారు. 500 ఎంఎల్ బాటిల్‌లో 20 గ్రాముల నైట్రోజన్ ఉంటే.. 45 కేజీల యూరియా బస్తాలో 46 శాతం నైట్రోజన్ ఉంటుంది. కానీ ఇది మట్టిలో పిచికారి చేయడం వల్ల పర్యావణం కలుషితమవుతుంది. నానో యూరియా స్ప్రే చేయడం వల్ల 80-90 శాతం అందులో ఉన్న పార్టికల్స్‌ను మొక్కలు వేగంగా గ్రహిస్తాయి. యూరియా పిచికారీ వల్ల మొక్కలకు 25-30 శాతం పార్టికల్స్ మాత్రమే అందుతాయి. మిగతావి గాలి, నీటిలో, నేలలో కలిసిపోతాయి. నానో యూరియా వాడకం వల్ల మట్టి, నీరు, గాలి కాలుష్యం తగ్గుతాయి. యూరియా వల్ల నైట్రేట్ లీచింగ్, గ్లోబల్ వార్మింగ్, ఓజోన్ లేయర్ డిప్లీషన్ వంటి సమస్యలు పెరుగుతాయి. నానో యూరియాను వాడటం వల్ల యూరియా వాడకాన్ని 50 శాతం వరకూ తగ్గించవచ్చు కానీ.. ఇదే పూర్తిగా ప్రత్యామ్నాయం కాదు. యూరియా వాడకం పంటలకు బేసల్ నైట్రోజన్ అవసరాలను తీరుస్తుంది. ప్రొటీన్ కంటెంట్‌ను పెంచుతుంది.

నానో యూరియాను పూర్తిగా రీప్లేస్మెంట్ చేస్తే దిగుబడి 10-21 శాతం తగ్గే ఛాన్స్ ఉన్నట్లు పలు అధ్యయనాలు తెలిపాయి. రూట్ వాల్యూమ్, ప్రొటీన్ కంటెంట్ కూడా తగ్గవచ్చు. యూరియాను ఎక్కువగా వాడటం కూడా మంచిది కాదు. దిగుబడి పెరిగినా నేల స్వభావం దెబ్బతింటుంది. భారత్‌లో 35 మిలియన్ టన్నుల యూరియాకు డిమాండ్ ఉండగా.. ప్రస్తుతం 26 మిలియన్ టన్నుల యూరియా మాత్రమే ఉత్పత్తి అవుతోంది. నానో యూరియా వాడితే ప్రభుత్వాలకు యూరియా దిగుమతుల ఖర్చు తగ్గుతుంది. ఒక ఏడాదికి సుమారు రూ.40 వేల కోట్లు ఆదా అవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. నానో యూరియాను యూరియాతో 50-75 శాతం కలిపి వాడితే మంచి ఫలితాలు ఉంటాయని, యూరియాను పూర్తిగా పక్కనపెట్టేసి, నానో యూరియానే వాడితే ఒక్కోసారి ఆశించిన మేర ఫలితాలు కనిపించకపోవచ్చంటున్నారు.

నానో యూరియాను వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, నూనె గింజలు, పప్పు దినుసులు పంటలపై పిచికారీ చేయొచ్చు. పంట ప్రధాన దశలో ఒకసారి.. కొద్దిరోజులకు మరోసారి పిచికారి చేయాల్సి ఉంటుంది. అంటే ఒక పంట కాలంలో రెండుసార్లు నానో యూరియాను స్ప్రే చేయాల్సి ఉంటుంది. ఒక యూరియా బస్తా సబ్సిడీలో సుమారు రూ.300కు లభిస్తే.. నానో యూరియా అరలీటర్ బాటిల్ ధర రూ.240కే లభిస్తుంది.



కేక్ కట్ చేస్తున్న ఆశావర్కర్లు

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని చాపర సిఐటియు కార్యాలయంలో ఆశావర్కర్ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. జిల్లా ఆశావర్కర్ల సంఘ అధ్యక్షురాలు ధనలక్ష్మి, కార్యదర్శి ఉత్తర పాల్గొని మాట్లాడారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వం అమలు చేసిన గ్రాడ్యూటీ, ప్రసూతి సెలవులు మంజూరు చేయడం, ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేకును కట్ చేశారు. అనంతరం ఈనెల 14న జరగనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశావర్కర్ల వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మండల ఆశా వర్కర్ల కమిటీని నియమించారు. మండల అధ్యక్షులుగా స్వర్ణలత పట్నాయక్, కార్యదర్శిగా టి.పద్మావతి, కోశాధికారిగా టి.రోజా, సభ్యులుగా ఆర్.హేమలత, పరమేశ్వరి, చంద్రకళ, నీలవేణి, ప్రభావతి, భానుమతి, అరుణ, శారదాంబ, ద్రాక్ష వేణి, తేజమ్మ ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, మండల ఆశావర్కర్ల నాయకులు స్వర్ణలత, మీనాక్షి, ఆశా కార్యకర్తలు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

సందడిగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- నరసన్నపేట

విద్యార్థులు నైపుణ్యతతోనే ఉపాధి అవకాశాలు పొందవచ్చని పద్మావతి విద్యా సంస్థల డైరెక్టర్ సిహెచ్ దుర్గా ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే సందడిగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర్చుకున్న జ్ఞానం పది మందికీ ఉపయోగపడుతూ సమాజహితం కావాలన్నారు. సాంకేతికంగా ప్రపంచం మారుతోందని, రేపటి రోజుల్లో విప్లవాత్మకమైన మార్పులు రాబోతున్నాయన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం యువత పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఇఎం నాయుడు, ఎఒ మెండ మోహన్ దాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, అధ్యాపక, విద్యార్థుల బృందం పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకగా సాగాయి.


ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి అప్పారావు

పంట ముంపు ప్రాంతాలు పరిశీలన

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన వరిపంటను స్థానిక రైతులతో మండల వ్యవసాయాధికారి ఆర్.అప్పారావు పరిశీలించారు. మరువాడ, మేఘవరం పంచాయతీల్లోని మరువాడ, చిన్న మరువాడ, దిబ్బల మరువాడ, చొక్కరవానిపేట, రెడ్డిక మరువాడ, మేఘవరం, పాతమేఘవరం, సూరాడవానిపేట గ్రామాలను సందర్శించి రైతులతో వరి పంట ప్రస్తుత పరిస్థితిని చర్చించారు. మూలపేట పోర్ట్ రహదారి నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన గొట్టాలు సరిపడా నీటిని బయటికి పంపలేక పోవడం వలన ప్రస్తుత ముంపు పరిస్థితి ఏర్పడిందని పలువురు రైతులు చెప్పారు. తగు చర్యలు తీసుకుని ముంపును నివారించాలని వారు కోరారు. కార్యక్రమంలో నీటి సంఘం ఉపాధ్యక్షులు మేరుగు నూకయ్య, స్థానిక సర్పంచ్ ప్రతినిధి దాసురాజు, మత్స్యకార సంఘ నాయకులు ధనరాజు, రైతులు పాల్గొన్నారు.

రణస్థలంలో అన్నదానం

రణస్థలం: రణస్థలం మండల కేంద్రం శ్రీరాంమాజనేయ థియేటర్ ఎదురుగా ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం మహా అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, ఎక్సైజ్, పోలీసు సిబ్బంది, మహిళలు, పిల్లలు, వృద్ధులు పాల్గొన్నారు.


అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్న యాత్రికులు

అప్పయ్యదొర ఆదర్శనీయుడు

ప్రజాశక్తి- నందిగాం

టెక్కలి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ హనుమంతు అప్పయ్య దొర 11వ వర్ధంతి సందర్భంగా వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ నందిగాం మండల కాంప్లెక్స్ ఆవరణలో గల అప్పయ్య దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఎర్ర చక్రవర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్మాన బాలకృష్ణారావు, మండల అధ్యక్షులు తమిరి ఫల్గుణరావు, వైసిపి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: అప్పయ్య దొర 11వ వర్ధంతి కార్యక్రమాన్ని పట్టణంలోని ప్రముఖ న్యాయవాది ఒడిస బాలకృష్ణ కార్యాలయంలో నిర్వహించారు. అప్పయ్య దొర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎస్.భాస్కరరావు, ఎస్ ఎస్ విజయ్ కుమార్, అప్పయ్య దొర అభిమానులు పాల్గొన్నారు.


పలాస : నివాళ్లర్పిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు

పలాస: రైతాంగానికి సాగునీరు, తాగునీరు అందించడమే హనుమంతు అప్పయ్యదొర ఆశయమని, ఆయన ఆశయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. అప్పయ్యదొర వర్ధంతి సందర్భంగా అప్పయ్యదొర విగ్రహానికి అప్పలరాజు తన అనుచరులతో పాటు, టిడిపి నాయకులు, అసమ్మతి వైసిపి నాయకులు పోటాపోటీగా పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ శివారు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించి మూడు పంటలు పండించి ఈ ప్రాంతం సస్యశ్యామలం చేసేందుకు వీలుగా అప్పయ్య దొర ఆఫ్షోర్ రిజర్వాయర్‌ను రూపకల్పన చేశారన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో 60 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం మారడంతో పనులు నిలిచి పోయాయన్నారు. అనంతరం వైసిపి అసమ్మతి వర్గం నాయకులు మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ ఆధ్వర్యంలో అప్పయ్య దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. టిడిపి తరుపున రాష్ట్ర ఎపిటిపిసి ఛైర్మన్ వజ్జ బాబూరావు అధ్వర్యంలో టిడిపి నాయకులు నివాళ్లర్పించారు. వెంకటరావుదొర, హనుమంతు రామ్మోహన్ దొర, విజయకుమార్ దొర, జి.గరునాద్, శిష్టు గోపి, బమ్మిడి దుర్యోధనరావు, డొక్కరి దానయ్య, మీసాల సురేష్‌బాబు, కింతలి ధర్మారావు, దువ్వాడ రవి తదితరులు పాల్గొన్నారు. జనసేన పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ వి.దుర్గారావు కాశీబుగ్గలో అప్పయ్య దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

నా భర్త ఆచూకీ తెలియజేయండి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

తన భర్త సానా రాజేష్ పదేళ్ల క్రితం దుబాయి వెళ్లారని, అప్పటి నుంచి 2019 జూన్ వరకు నిత్యం ఫోన్‌లో మాట్లాడే వారని, అంతే కాకుండా ఇంటి ఖర్చులకు డబ్బులు పంపించే వారని, తరువాత ఏమైందో తెలియదని అప్పటినుంచి ఇప్పటివరకు ఫోన్లు రాకపోగా ఆయన ఆచూకీ ఏమైందో తెలియడం లేదని చినవంక గ్రామానికి చెందిన సానా ఢిల్లమ్మ చెప్పారు. శుక్రవారం ఆమె విలేకరుల వద్ద తన ఆవేదనను వ్యక్తం చేశారు. భర్త ఆచూకీ తెలియక పోవడంతో ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియడం లేదన్నారు. ఇన్నాళ్లు ఆయన నుంచి ఫోన్ వస్తుందని, లేదా ఇంటికి క్షేమంగా తిరిగి వస్తారని ఎదురు చూసానని ఇంతవరకు ఎలాంటి సమాచారం లేకపోవడం ఆందోళనగా ఉందని పేర్కొన్నారు. దీంతో కూలి పనులు చేసుకుంటూ కుమార్తెతో కలిసి జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. కరోనా నుంచి తనకు ఫోన్ సంప్రదింపులు లేనట్లు పేర్కొన్నారు. మండలం చినవంక గ్రామానికి చెందిన సానా రాజేష్, ఢిల్లమ్మ దంపతులకు ఒక కుమార్తె ఉంది. అయితే ప్రైయివేటు కంపెనీలో ఉద్యోగం చేసుకొనే వీరికి ఆదాయం సరిపడకపోవడంతో దుబాయి వెళ్లారని, అప్పటి నుంచి తరుచూ పోన్లో మాట్లాడేవాడని తెలిపారు. అలాగే ప్రతినెల ఖర్చుల కొరకు డబ్బులు పంపించే వాడని, సుమారు ఆరేళ్లుగా అతని నుంచి ఫోన్లు రావడం లేదని తాము చేసినా స్విచ్ ఆఫ్ అని వస్తూన్నట్లు ఢిల్లమ్మ తెలిపారు. రాజేష్ ఎక్కడ ఉన్నారో తెలియక ఆందోళనగా ఉందని అధికారులు, నాయకులు స్పందించి తన భర్త ఆచూకీ కనిబెట్టి చెప్పాలని ఢిల్లమ్మ వేడుకుంటుంది.


భర్త ఫొటో ఉన్న ఆరోగ్యశ్రీ కార్డును చూపిస్తున్న ఢిల్లమ్మ

నా బిడ్డను ఆదుకోండి

ప్రజాశక్తి- నందిగాం

మండలం బోరుభద్ర పంచాయతీ కామ ధేనువు గ్రామానికి చెందిన చింతన నారాయణ, నేలవేణి దంపతులకు మీనాక్షి అనే పాప ఉండగా పాపకు వయసులో వ్యాధి బారిన పడే శరీర మంతా చలనం లేకపోవడంతో తన స్థోమత మేరకు టెక్కలి, పలాస, శ్రీకాకుళం, విశాఖపట్నం వంటి పట్టణాల్లో గల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించామని అయితే వైద్యానికి సరిపడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నామని బిడ్డను రక్షించుకోవాలనే తపనతో వైద్యులను ఆశ్రయించిన ఫలితం లేదని ప్రతినెల రూ.20 వేలు మందులు వాడాలని డాక్టర్లు సూచించడంతో ఆర్థిక స్థోమత లేక నిస్సహాయ స్థితిలో కుమార్తెను చూసి దాతలు ఎవరైనా ముందుకొచ్చి సహాయం చేస్తే తమ పాపను రక్షించుకుంటామని వారు కోరుతున్నారు.


కుమార్తెతో నారాయణ, నీలవేణి దంపతులు

ఎల్‌ఎల్‌ఎం పట్టాను పొందిన చారుమతి

కోటబొమ్మాళి: మండలంలోని నిమ్మాడ పంచాయతీ సర్పంచ్ కింజరాపు సురేష్‌బాబు సతీమణి చారుమతి ఎల్‌ఎల్‌ఎం పట్టాను పొందారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త స్నాతోత్సవాలు విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు నాయ్యమూర్తి జస్టిస్ పి.నరసింహా చేతులమీదుగా అమె పట్టాను అందుకున్నారు. అమె కుటుంబ సభ్యులు, ప్రముఖులు, గ్రామస్తులు చారుమతిని అభినందించారు.

చండిపుట్టుగలో నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- కవిటి

సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మండలంలోని చండిపుట్టుగలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సోంపేట ఆరోగ్యవరం సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ ఎం.లక్ష్మణరావు, డా ఆర్.శ్రీనివాసరావు, డా వి.ఆకాష్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. ఈ శిబిరంలో 80 మందిని పరీక్షించి అందులో 30 మందికి కళ్లద్దాలు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాముకు డాక్టరేట్‌పై హర్షం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణానికి చెందిన జిల్లా విజిలెన్స్ ఎస్‌సి, ఎస్‌టి మోనటరింగ్ సభ్యులు తోట రాముకు డాక్టరేట్ లభించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం విశాఖపట్నంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో డైస్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ యు.ఎస్.ఎ రాముకు ఈ డాక్టరేట్ ప్రధానం చేసింది. జిల్లా దళిత నాయకులు ఎడ్ల ఈశ్వరరావు, అదపాక గౌరి నాయుడు, గుర్రాల చిన్నబాబు, ఇల్లాకుల సూర్య ప్రకాష్, పొన్నాడ అప్పలసూరి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రాముకు డాక్టరేట్ లభించడంపై ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో పాటు పట్టణ టిడిపి నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, బోర గోవిందరావు, బోనెల అప్పారావు, నాగళ్ల మురళీధర్ యాదవ్ హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.


డాక్టరేట్‌ను అందుకుంటున్న రాము



తవుడు మాస్టార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని బురిడికంచరాం ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మెండ తవుడు రూ.20 వేలు విలువ చేసే ఫర్నీచర్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు బీరువా, సఫారీ కుర్చీ, దేశ నాయకుల ఫోటోలను అందజేశారు. అనంతరం హెచ్ఎం పి.ఎం.మురళీబాబు ఆధ్వర్యంలో తవుడు మాష్టర్‌ను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ వండాన మురళీ, పిఎంసి ఛైర్మన్ పి.అసిరినాయుడు, వైస్ ప్రెసిడెంట్ పి.అప్పలనాయుడు, గ్రామపెద్దలు వి.అప్పలనాయుడు, ఎస్.భాస్కరరావు, ఎం.పూర్ణ చంద్రదేవ్, వి.కిరణ్‌కుమార్, వై.బండారి, ఎస్.అసిరినాయుడు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.


నేత్రదాన ప్రతిజ్ఞ పత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్ అశోక్ చక్రవర్తి

నేత్రదానంపై అవగాహన

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని దండుగోపాలపురం సర్పంచ్ మార్పు అశోక్ చక్రవర్తి స్వచ్ఛందంగా మరణానంతరం తన కళ్ల దానం చేయడానికి ముందుకు వచ్చారు. 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ నేత్రసేకరణ కేంద్రం శ్రీకాకుళం కోఆర్డినేటర్, పిహెచ్‌సి ఆప్తాలమిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్‌కు నేత్రదాన ప్రతిజ్ఞ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. కార్నియల్ అంధత్వం నివారణకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. ఎం. విశ్వనాథ్ గంగాధర్, ఆరోగ్య విస్తరణ అధికారి వి.వి. నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.


తోటయ్యదొరను పరామర్శిస్తున్న ఎంపీ అప్పలనాయుడు

విజయనగరం ఎంపీ పరామర్శ

లావేరు: లావేరు పంచాయతీ కేశవరాయపురం గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ ఛైర్మన్ యినపకుర్తి తోటయ్యదొరను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం పరామర్శించారు. తోటయ్యదొర ఇటీవల ప్రమాదవశాత్తు జారిపడిపోయి చేయి విరిగిపోవడంతో విషయం తెలుసు కున్న ఎంపీ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. ఈయనతో లావేరు మాజీ సర్పంచ్ మాకన శంకరరావు, లంకలపల్లి శ్రీనువాసరావు, యినప కుర్తి భాస్కరరావు, మాజీ జెడ్‌పిటిసి ఎస్.త్రినాథరావు, ఎల్.నరేష్, ఐ.సీతారామరాజు, లంకలపల్లి గోవిందరావు, కృష్ణ, ఆగత మాలచ్చి తదితరులున్నారు.

బోరు నిర్మాణానికి భూమి పూజ

సంతబొమ్మాళి: మండలంలోని మరువాడ పంచాయతీలో గుడ్డిమీదపేట గ్రామం ఎల్లమ్మ తల్లి గుడి వద్ద తాగునీటి బోరు నిర్మాణానికి సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీర ప్రాంతంలో తాగునీటి ఎద్దడి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార నాయకులు సూరాడ దానరాజు, వార్డ్ మెంబర్లు సూరాడ బాలరాజు, సింహచలం, మత్స్యకార యువ నాయకులు సూరాడ కృష్ణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు

పలాస: పలాస కాశీబుగ్గలో ఈద్ మిలాద్ నబీ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకనే మిలాద్ నబీగా నిర్వహించుకుంటారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరుడు మహమ్మద్ ప్రవక్త చిత్రపటంతో జంట పట్టణాల్లో ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్.కె.భాష, కార్యదర్శి ఎస్.కె. బషీర్, సభ్యులు గౌస్, తుమిమ్, షాబుద్దీన్, రాజేష్ ఖాన్, అబ్దుల్లా ఖాన్, ఖాసీమ్, మున్నా జిలాని, బబ్లూ, సయ్యద్ షాహిద్, వరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.